

ప్రజాతీర్పు
- 2024 -

రాయ్‌బరేలిలో వరుణ్ గాంధీ పోటీ?

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ, అమేథీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు తన అభ్యర్థులను ప్రకటించలేదు. బీజేపీ కూడా రాయ్‌బరేలీలో తన అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఈ నేపథ్యంలో తన సిట్టింగ్ స్థానమైన పిలిభిత్ నుంచి బీజేపీ టికెట్ నిరాకరణకు గురైన వరుణ్ గాంధీ.. రాయ్‌బరేలి నుంచి పోటీచేస్తారనే ప్రచారం జరుగుతున్నది. దీనిపై మీడియా ప్రతినిధులు వరుణ్ గాంధీని అడుగ్గా.. ధ్రువీకరించడం కానీ, ఖండించడం గానీ చేయలేదు. అంతర్గతంగా జరిగిన చర్చల గురించి బయట చెప్పడం సరికాదని ఆయన అన్నారు. రాయ్‌బరేలీ నుంచి గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన సోనియా గాంధీ.. ఈసారి రాజ్యసభకు వెళ్లిపోయారు. మరో వైపు ప్రియాంక గాంధీ, ఆమె భర్త రాబర్ట్ వాద్రా కూడా పోటీకి దిగుతారనే ప్రచారం జరుగుతున్నది.

ఆస్తిలో సగం సర్కార్‌కే

వ్యక్తి మరణిస్తే వారసులకు 45%.. మిగతాది ప్రభుత్వానికే

- వారసత్వ పన్ను ఉండాల్సిందే
- ఇది న్యాయమే అనిపిస్తుంది
- అమెరికాలో ఈ పన్ను ఉంది
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్యామ్ పిట్రోడా సంచలన వ్యాఖ్యలు
- పార్టీకి సంబంధం లేదన్న కాంగ్రెస్
- దోచుకోవడమే వారి లక్ష్యమన్న మోదీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా 'ఆర్థిక సర్వే' చేపడుతామంటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించడం రాజకీయ దుమారాన్ని రేపుతున్న సమయంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఛైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, గాంధీల కుటుంబానికి అత్యంత సన్నిహితుడు శ్యామ్ పిట్రోడా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో వారసత్వ పన్ను ఉండాలని, మరణించిన వారి ఆస్తుల్లో మెజారిటీ వాటాను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పంపిణీ చేయాలని కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు. ఈ మేరకు ఓ టీవీ ఇంటర్వ్యూలో మంగళవారం ఆయన మాట్లాడారు.

న్యాయబద్ధంగానే కనిపిస్తున్నది

'అమెరికాలో వారసత్వ పన్ను అనేది ఉన్నది. దాని ప్రకారం.. ఒక వ్యక్తి దగ్గర 100 మిలియన్ల డాలర్ల విలువైన సంపద ఉందనుకొందాం. ఆ వ్యక్తి మరణిస్తే.. ఆ సొత్తు అంతా వారసులకు వెళ్లదు. సంపదలో 45 శాతం మాత్రమే వారసులకు బదిలీ అవుతుంది. మిగిలిన 55 శాతాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొంటుంది. ఇదొక ఆసక్తికరమైన చట్టం. నేటి తరంవారు.. సంపదను సృష్టించి వెళ్లిపోతున్నారు. అది వారి వారసులకు మాత్రమే దక్కుతుంది. వారసత్వ పన్ను అనేది దేశంలో అమల్లోకి తీసుకొస్తే, ఆ సంపదలో సగం వాటా ప్రభుత్వానికి చెందుతుంది. తద్వారా ప్రజలకు పంచిపెట్టొచ్చు. ఈ విధానం నాకు న్యాయబద్ధంగానే కనిపిస్తున్నది' అని పిట్రోడా పేర్కొన్నారు.

శ్యామ్ పిట్రోడా | రాహుల్ | మోదీ

దోచుకోవాలనుకొంటున్నారు: మోదీ

పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మండిపడ్డారు. మరణించిన వారి ఆస్తులను కూడా కాంగ్రెస్ దోచుకోవాలనుకొంటున్నదని ధ్వజమెత్తారు. 'తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా పొందిన సంపదపై కాంగ్రెస్ పన్ను విధించాలని చూస్తున్నది. మీరు చెమట చిందించి కూడబెట్టిన సొత్తు.. మీ పిల్లలకు లభించదు. వ్యక్తులు బతికి ఉన్నప్పుడే కాదు.. చనిపోయినప్పుడు కూడా వారిని దోచుకోవడం కాంగ్రెస్ విధానంలా కనిపిస్తున్నది. పూర్వీకుల ఆస్తిని అనుభవిస్తున్న ఆ వ్యక్తులు (గాంధీ కుటుంబాన్ని ఉద్దేశిస్తూ).. భారతీయులు తమ ఆస్తుల్ని పిల్లలకు ఇవ్వడాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు' అని విరుచుకుపడ్డారు.

మాకు సంబంధంలేదు: కాంగ్రెస్

పిట్రోడా వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండటంతో కాంగ్రెస్ నష్ట నివారణ చర్యలకు దిగింది. ఆయన వ్యాఖ్యలు వ్యక్తిగతమని, పార్టీకి ఎలాంటి సంబంధం లేదని చెప్పింది. తన వ్యాఖ్యలను వక్రీకరించారని బుధవారం పిట్రోడా వివరణ ఇచ్చారు. సమస్యల నుంచి దృష్టి మరల్చడానికి బీజేపీ ఇలా చేస్తున్నదని ఎదురుదాడికి దిగారు.

మేం అలా అన్లేదు: రాహుల్‌గాంధీ

దేశ ప్రజల సంపదను సర్వే చేసి పునఃపంపిణీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిందన్న వార్తలపై ఆ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ వివరణ ఇచ్చారు. ఆర్థిక సర్వే అనంతరం తాము చర్యలు తీసుకొంటామని ఎక్కడా చెప్పలేదని, దేశంలో ఎంతమందికి అన్యాయం జరిగిందన్న విషయాన్ని తెలుసుకోవడానికే ఈ సర్వే చేపడతామని చెప్పామన్నారు.

'తొలి దఫా' తేడా కొట్టిందా!

- అందుకే ప్రధాని ప్రసంగాల్లో అసహనం, విద్వేషం?
- ప్రతీ సభలో మతాల మధ్య చిచ్చు పెట్టే వ్యాఖ్యలే
- మంగళసూత్రాలు, హనుమాన్ చాలీసా ఆరోపణలే
- ప్రసంగంలో వినిపించని 'వికసిత్ భారత్' నినాదం
- సభల్లో కనిపించని 400 సీట్లు సాధిస్తామన్న ధీమా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): 'ఈసారి 400కు పైగా సీట్లు సాధిస్తామని, వికసిత్ భారత్‌ను ఆవిష్కరిస్తామంటూ నిన్నటివరకూ ఊదరగొట్టిన ప్రధాని మోదీ.. ఇప్పుడు ప్రచార సభల్లో ఆ విషయాల్నే ప్రస్తావించట్లేదు. ఏప్రిల్ 19న జరిగిన తొలి దఫా ఓటింగ్ అనంతరం ఆయన ప్రసంగాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొన్నటివరకు అది చేశాం, ఇది చేశాం అంటూ చెప్పుకొచ్చిన ప్రధాని.. మొదటి దఫా పోలింగ్ కాగానే ఉన్నట్టుండి విద్వేష వ్యాఖ్యలకు దిగుతున్నారు. తొలిదఫాకు సంబంధించి అంతర్గత సర్వేలు ఇచ్చిన ఫలితాలు బీజేపీకి ఆశాజనకంగా లేకపోవడమే దీనికి కారణంగా విశ్లేషకులు అనుమానిస్తున్నారు.

తొలిదఫా పోలింగ్ తర్వాత మోదీ వ్యాఖ్యలు

కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే, హనుమాన్ చాలీసాను వినడాన్ని కూడా నేరంగా పరిగణిస్తారు. మన విశ్వాసాలను ఆచరించడం కూడా కష్టమే. ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ తెగబడుతున్నది. ఎస్సీ, ఎస్టీ కోటా తగ్గించి ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలని 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆంధ్రప్రదేశ్‌లో దీన్నో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి అనంతరం దేశమంతటా అమలు చేయాలనుకొన్నది.

– మంగళవారం రాజస్థాన్‌లోని టోంక్ సభలో ప్రధాని మోదీ

అధికారంలోకి వచ్చాక ప్రజల వద్ద ఉన్న బంగారం సహా సంపదనంతా సర్వే చేసి అందరికీ సమంగా పునఃపంపిణీ చేస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పింది. అంటే మన అక్కా-చెల్లెళ్లు, తల్లుల మంగళ సూత్రాలను దోచుకొనేందుకు వాళ్లు చట్టాలను కూడా మార్చేస్తారు. ఎవరికైనా రెండు ఇండ్లు ఉంటే, ఒక ఇంటిని లాగేసుకొంటారు. ఎన్నో దేశాలను నాశనం చేసిన ఈ విధానాలు మనకు కావాలా?

– సోమవారం యూపీలోని అలీగఢ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

జాతి సంపదపై మొదటి హక్కు ముస్లింలదే అని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారు. అర్బన్ నక్సలిజం మనస్తత్వం కలిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మన తల్లులు, చెల్లెళ్ల మంగళ సూత్రాలను కూడా వదలరు. దేశ సంపదనంతా చొరబాటుదారులకు, ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి (ముస్లింలకు) పంచుతారు. ఇది మీకు సమ్మతమేనా?

– ఆదివారం రాజస్థాన్‌లోని జాలోర్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

ఎవరికి ఏం నచ్చితే అది తినొచ్చు. ఏ చట్టమూ దీన్ని అడ్డుకోలేదు. అయితే, నవరాత్రి, శ్రావణ మాసం వంటి పవిత్ర దినాల్లోనూ మాంసాన్ని తింటున్నారంటే వారి (ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌ను ఉద్దేశిస్తూ..) ఉద్దేశం మరొకటి అయ్యి ఉండొచ్చు. ఇలాంటి మైండ్ సెట్ మొగలాయిలకే ఉంటుంది.

–ఏప్రిల్ 12న ఉదంపూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ

'రెండో విడత' ప్రచారానికి తెర

89 స్థానాలకు రేపు పోలింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: లోక్‌సభ రెండో విడత ఎన్నికల ప్రచారానికి బుధవారంతో తెరపడింది. 13 రాష్ర్టాలు, యూటీల్లోని 89 లోక్‌సభ స్థానాలకు 26న శుక్రవారం పోలింగ్ జరుగనున్నది. తొలి విడతలో 21 రాష్ర్టాల్లోని 102 స్థానాలకు 19న ఎన్నికలు జరిగాయి. రెండో విడతలో రాహుల్‌గాంధీ (వయనాడ్), హేమామాలిని (మథుర), రాజీవ్ చంద్రశేఖర్ (తిరువనంతపురం), శశిథరూర్ (తిరువనంతపురం), ఓం బిర్లా (కోటా), అరుణ్ గోవిల్ (మీరట్), కుమారస్వామి (మండ్య) వంటి ప్రముఖులు ఉన్నారు. మూడో దశ ఎన్నికలు మే 7న జరుగనున్నాయి.

కన్నౌజ్ నుంచే అఖిలేశ్ పోటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పోటీ చేసే నియోజకవర్గంపై ఊహాగానాలకు తెరపడింది. యూపీలోని కన్నౌజ్ నియోజకవర్గం నుంచి ఆయన గురువారం నామినేషన్ వేస్తారని ఆ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ ప్రకటించారు. సమాజ్‌వాదీ పార్టీకి ఎంతో పట్టున్న కన్నౌజ్ నియోజకవర్గం నుంచి అఖిలేశ్ మూడు సార్లు విజయం సాధించారు. 2012, 2014 ఎన్నికల్లో ఆయన భార్య డింపుల్ యాదవ్ గెలిచారు. అయితే 2019 ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి పాథక్ చేతిలో ఓటమి చవిచూశారు. కాగా, కొద్ది రోజుల క్రితం ఈ నియోజకవర్గం నుంచి అఖిలేశ్ మేనల్లుడు, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ అల్లుడైన మాజీ ఎంపీ తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేస్తారని పార్టీ వర్గాలే ప్రకటించాయి. అయితే పార్టీ నేతల ఒత్తిడి మేరకు అఖిలేశే పోటీలో ఉండాలని నిర్ణయించారు.

ర్యాలీలో స్పృహతప్పి పడిపోయిన గడ్కరీ

ముంబై: ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయారు. మహారాష్ట్రలోని యావత్మాల్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిందీ ఘటన. వెంటనే అప్రమత్తమైన మిగతా నేతలు ఆయనకు సపర్యలు చేయడంతో కాసేపటికి కోలుకుని తిరిగి ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రసంగం పూర్తిచేసిన తర్వాత ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. ర్యాలీలో ఎండవేడిమి కారణంగా కొంత అసౌకర్యంగా అనిపించిందని పేర్కొన్నారు.

హైకోర్టు జాప్యంపై సుప్రీంకు సోరెన్

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ తాను దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వెల్లడించడం లేదని జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పును ఫిబ్రవరి 28న రిజర్వు చేసిందని, ఇప్పటికీ తన నిర్ణయాన్నినిర్ణయాన్ని ప్రకటించడం లేదని చెప్పారు. హేమంత్ సోరెన్‌ను మనీలాండరింగ్ కేసులో ఈడీ జనవరి 31న అరెస్ట్ చేసింది. అంతకుముందు ఆయన జార్ఖండ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.

మోదీజీ కా..'5జీ మెగా స్కామ్'!

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం '5జీ మెగా స్కామ్'కు రంగం సిద్ధం చేస్తున్నదని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. వేలం ద్వారా మాత్రమే 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులు జరుగాలంటూ 2012లో ఇచ్చిన తీర్పును సవరించాలని, పాలనాపరమైన ప్రక్రియకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడంపై ఆయన స్పందించారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపునకు సంబంధించి గత పాలసీని'(ముందొచ్చిన వాళ్లకు తొలి అవకాశం)' వ్యతిరేకించిన ప్రధాని మోదీ, ఇదే బీజేపీ.. ఇప్పుడు అడ్మినిస్ట్రేటివ్ ప్రక్రియ ద్వారా స్పెక్ట్రమ్ కేటాయింపునకు సంబంధించిన అదే పాలసీని గత ఏడాది పార్లమెంట్‌లో ఎంపీలను బయటకు పంపి మరీ ఆమోదించుకొన్నదని సంజయ్ సింగ్ విమర్శించారు.

బాండ్ల పథకంలో క్విడ్ ప్రో కోపై

సిట్ విచారణకు ఆదేశించండి..

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల పథకంలో డాటా ఆధారంగా 'క్విడ్ ప్రో కో' ఉదంతాలపై కోర్టు పర్యవేక్షణలో సిట్ విచారణ జరపాలంటూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. రాజకీయ పార్టీలు, కార్పొరేట్లకు మధ్య నెలకొన్న 'క్విడ్ ప్రో కో' సంబంధాల్ని ఈ విచారణ బయటపెడుతుందని పిటిషన్ పేర్కొన్నది. ఎస్‌బీఐ నుంచి వెలువడిన దాతల వివరాల ఆధారంగా రెండు ఎన్జీవో సంఘాలు సుప్రీంకోర్టులో సంయుక్తంగా ఓ పిటిషన్ వేశాయి. ఆయా రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాల్లో అత్యధిక భాగం.. అనుకూల విధానాల కోసం, దర్యాప్తు సంస్థల విచారణ నిలుపుదల కోసం ఇచ్చినట్టు పిటిషన్ ఆరోపించింది. సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరింది.

25వేల కోట్ల కుంభకోణంలో

సునేత్ర పవార్‌కు క్లీన్‌చిట్

- సహకార బ్యాంకు స్కామ్ కేసును మూసివేసిన ముంబై పోలీసులు
- బీజేపీ 'వాషింగ్ మెషీన్' నిరూపితం
- శివసేన నేత ఆనంద్ దూబే విమర్శ

ముంబై, ఏప్రిల్ 24: రూ.25 వేల కోట్ల సహకార బ్యాంకు కుంభకోణం ఆరోపణల కేసులో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌కు ముంబై పోలీసులు క్లీన్ చిట్ ఇచ్చారు. సునేత్ర పవార్, ఆమె భర్త అజిత్ పవార్‌కు సంబంధించి లావాదేవీల్లో ఎలాంటి క్రిమినల్ నేరం జరుగలేదని పేర్కొంటూ మహారాష్ట్ర స్టేట్ సహకార బ్యాంకు(ఎంఎస్‌సీబీ) కేసును విచారిస్తున్న ముంబై పోలీసు విభాగానికి చెందిన ఆర్థిక నేరాల వింగ్(ఈవోడబ్ల్యూ) పేర్కొన్నది. రుణాల మంజూరుతో బ్యాంకుకు ఎలాంటి నష్టం రాలేదని తెలిపింది. ఈ కేసును మూసివేస్తూ ఈ ఏడాది జనవరిలో సమర్పించిన రిపోర్టు వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. సునేత్ర పవార్ ప్రస్తుతం రాష్ట్రంలోని బారామతి లోక్‌సభ స్థానం నుంచి శరద్‌పవార్ కుమార్తె సుప్రియా సూలేపై పోటీచేస్తున్నారు.

గతంలో ప్రధాని మోదీనే ఆరోపించారు..

గత ఏడాది శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని చీల్చి, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో చేరిన అజిత్ పవార్ భార్య సునేత్రకు పోలీసులు క్లీన్‌చిట్ ఇవ్వడం ప్రతిపక్షాలకు ఎన్నికల వేళ ఆయుధంగా మారింది. బీజేపీ మరోసారి తన ప్రతిపక్షాలు పెట్టిన 'వాషింగ్ మెషిన్' పేరును సార్థకం చేసుకొన్నదని శివసేన(యూబీటీ) నేత ఆనంద్ దూబే ఎద్దేవా చేశారు. రూ.25 వేల కోట్ల స్కామ్ జరిగిందని, పవార్ కుటుంబం మొత్తం అవినీతిపరులేనంటూ సాక్షాత్తూ ప్రధాని మోదీ గతంలో ఆరోపణలు చేసిన కేసులోనే ఇప్పుడు పోలీసులు క్లీన్‌చిట్ ఇవ్వడం శోచనీయమని అన్నారు. ఇతర పార్టీలకు చెందిన వాళ్లు బీజేపీలో చేరితే, ఆ పార్టీ వాషింగ్ మెషీన్‌లో ఉతికితే.. ఎలాంటి ఆరోపణలు, మరకలు అయినా మాయం అవుతాయనే విమర్శలు నిజమనే విషయాన్ని కమలం పార్టీ మరోసారి నిరూపించుకొన్నదని దూబే పేర్కొన్నారు. బీజేపీ విధానాలను వ్యతిరేకించిన కేజ్రీవాల్, హేమంత్ సోరేన్‌లను జైలుకు పంపుతారని, వాళ్లతో(బీజేపీ) చేరిన వాళ్లకైతే డిప్యూటీ సీఎం, మంత్రి పదవులు వస్తాయని, లోక్‌సభ టికెట్లు కూడా ఇస్తారని విమర్శించారు.

ఈవీఎంలపై స్పష్టతివ్వండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు సూచన
- ఐదు సందేహాలు లేవనెత్తిన ద్విసభ్య ధర్మాసనం
- ఓట్లను వీవీప్యాట్లతో సరిపోల్చాలన్న పిటిషన్లపై తీర్పు వాయిదా
- ఎన్నికలను తాము నియంత్రించలేమని వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఈవీఎంల పనితీరుపై గందరగోళాన్ని తొలగించేందుకు మరింత స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు సూచించింది. ఈవీఎంలు, వీవీప్యాట్లు, మైక్రోకంట్రోలర్‌కు సంబంధించి ఐదు సందేహాలను ధర్మాసనం లేవనెత్తింది. వీటికి ఎన్నికల కమిషన్ అధికారులు బదులివ్వగా, తీర్పును వాయిదా చేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది. ఈవీఎంలలో పోలైన ఓట్లను వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించడం ద్వారా సరిపోల్చాలని దాఖలైన పిటిషన్లను బుధవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్లను ఏప్రిల్ 18న విచారించిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. బుధవారం తీర్పు ఇవ్వాల్సి ఉండగా.. ఈవీఎంల పనితీరుపై మరిన్ని సందేహాలు ఉన్నందున ముందుగా స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సంఘానికి సూచించింది.

ఈవీఎంలపై 5 సందేహాలు

ఈవీఎంల పనితీరును ఇప్పటికే ఎన్నికల కమిషన్ అధికారులు కోర్టుకు నివేదించగా.. ఐదు సందేహాలను కోర్టు లేవనెత్తింది. 'మైక్రోకంట్రోలర్ కంట్రోలింగ్ యూనిట్‌లో ఉంటుందా? వీవీప్యాట్‌లో ఉంటుందా? అని ప్రశ్నించింది. మైక్రోకంట్రోలర్ ఒకసారి మాత్రమే ప్రోగ్రామ్ చేసేదేనని నిర్ధారిస్తారా ? సింబల్ లోడింగ్ యూనిట్లు ఎన్ని అందుబాటులో ఉన్నాయి? అని ఈసీని అడిగింది. ఈవీఎంలను 30 రోజులు భద్రపరుస్తారా? 45 రోజులా? తదితర సందేహాలపై స్పష్టత ఇవ్వాలని ధర్మాసనం సూచించింది.

ఈసీ పనితీరును నిర్దేశించలేం: సుప్రీం

కోర్టు సందేహాలకు ఈసీ అధికారి నితేశ్ కుమార్ వ్యాస్ బదులిచ్చారు. తమ సందేహాలను ఈసీ నివృత్తి చేసిందని ధర్మాసనం పేర్కొన్నది. పిటిషనర్ల ఆలోచనా ధోరణిని తాము మార్చలేమని, కేవలం అనుమానాలను ఆధారంగా చేసుకొని ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థ అని, దాని పని తీరును తాము నిర్దేశించలేమని, ఎన్నికల ప్రక్రియను నియంత్రించలేమని పేర్కొన్నది. కాగా, పారదర్శకత కోసం ఈవీఎంల సోర్స్ కోడ్‌లను బహిర్గతం చేయాలని పిటిషనర్ల తరపు న్యాయవాది కోరగా.. దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున సోర్స్ కోడ్‌ను బయటకు వెల్లడించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది.

ఈవీఎం తయారీదారుల పేర్లు బయటపెట్టలేం: ఈసీఐఎల్, బీఈఎల్

ఈవీఎం, వీవీప్యాట్ తయారీదారులు, అందులో వినియోగించిన వివిధ పరికరాల సరఫరాదారుల పేర్లను సమాచార హక్కు చట్టం కింద బహిర్గతం చేయడానికి ఈసీఐఎల్, బీఈఎల్ నిరాకరించాయి. సామాజిక కార్యకర్త వెంకటేష్ నాయక్ ఆర్టీఐ కింద ఈ వివరాలు అడిగారు. అయితే వాణిజ్య రహస్యం అని పేర్కొంటూ వివరాలు ఇచ్చేందుకు ఆ రెండు సంస్థలూ నిరాకరించాయి. దరఖాస్తుదారు అడిగిన సమాచారం వాణిజ్య రహస్యమని, ఆర్టీఐ చట్టం సెక్షన్ 8(1)(డీ) కింద సదరు వివరాలు ఇవ్వలేమని ఈసీఐఎల్, బీఈఎల్ ఒకే సమాధానాన్ని ఇచ్చాయి.

త్రిపుర వెస్ట్‌లో 100%కిపైగా ఓటింగ్!

న్యూఢిల్లీ: త్రిపురలోని పశ్చిమ త్రిపుర లోక్‌సభ నియోజకవర్గంలో, రామ్‌నగర్ శాసనసభ స్థానంలో ఈ నెల 19న జరిగిన పోలింగ్‌లో అక్రమాలు జరిగాయని, మళ్లీ పోలింగ్ నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరగలేదని సీపీఎం త్రిపుర శాఖ కార్యదర్శి జితేంద్ర చౌదరి ఆరోపించారు. మజ్లిస్పూర్ సెగ్మెంట్‌లో 105.30%, ఖాయర్‌పూర్‌లో 100.15 శాతం, మోహన్‌పూర్ సెగ్మెంట్‌లో 109.09 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు. కాగా, పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులను నిర్వహించిన పోలింగ్ అధికారులు తమ ఓట్లు తామే వేశారని, అందుకే ఇలా జరిగిందని అధికారులు చెప్తున్నారు.

లోక్‌సభ బరిలో మూసేవాలా తండ్రి

బటిండ (పంజాబ్), ఏప్రిల్ 24: పంజాబ్ గాయకుడు దివంగత సిద్ధూ మూసేవాలా తండ్రి బల్‌కౌర్ సింగ్ లోక్‌సభ బరిలో నిలవనున్నారు. బటిండ లోక్‌సభ స్థానం నుంచి ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలు ఇప్పటికే ప్రారంభం కాగా, ఏడో దశలో జూన్ 1న ఇక్కడ పోలింగ్ జరుగనున్నది. ఇక్కడ శిరోమణి అకాలీదళ్, కాంగ్రెస్, ఆప్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

నా అంత్యక్రియలకైనా రండి: ఖర్గే

కలబురగి: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన సొంత జిల్లా కలబురగి ప్రజలను ఆకట్టుకునేందుకు భావోద్వేగపూరితంగా మాట్లాడారు. ఈ జిల్లాలోని అఫ్జల్‌పూర్‌లో బుధవారం జరిగిన కాంగ్రెస్ ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయడం మీకు ఇష్టం లేకపోయినప్పటికీ, కలబురగి కోసం పని చేశానని భావిస్తే, కనీసం తన అంత్యక్రియలకు హాజరుకావాలని కోరారు. ''మీరు కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయకపోతే, నాకు కలబురగిలో ఇక స్థానం లేదని, నేను మీ మనసు గెలుచుకోలేదని భావిస్తాను'' అన్నారు. బీజేపీ, ఆరెస్సెస్ సిద్ధాంతాన్ని ఓడించేందుకు తాను రాజకీయాల్లో తుది శ్వాస వరకు కొనసాగుతానని చెప్పారు.

మా అభ్యర్థికి ఓటేయొద్దు!

బన్‌స్వారా, ఏప్రిల్ 24: రాజస్థాన్‌లోని బన్‌స్వారా-దుంగార్పూర్ ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికల పోరు విచిత్రంగా మారింది. గిరిజనులు అధికంగా నివసించే ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తన సొంత అభ్యర్థికి ఓటు వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తుండటమే ఈ విచిత్ర పరిస్థితికి కారణం. వివరాల్లోకెళ్తే.. ఆ నియోజకవర్గానికి కాంగ్రెస్ తొలుత తమ అభ్యర్థిగా అర్వింద్ దమోర్ పేరును ప్రకటించడంతో ఆయన నామినేషన్ దాఖలు చేశారు. కానీ, ఆ తర్వాత భారత్ ఆదివాసీ పార్టీతో కాంగ్రెస్‌కు పొత్తు కుదరడంతో రెండు పార్టీలు కలిసి ఉమ్మడి అభ్యర్థిగా రాజ్‌కుమార్ రోత్‌ను బరిలోకి దింపాయి. కానీ, అప్పటికే వేసిన నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు దమోర్ నిరాకరించారు. ఈ నేపథ్యంలో దమోర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్నది. కాంగ్రెస్ ఓట్లను దమోర్ చీల్చే అవకాశం ఉండటంతో ఆ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మహేంద్రసింగ్ మాలవీయకు లబ్ధి చేకూరడం ఖాయమని స్పష్టమవుతున్నది.

అర్వింద్

ఒడిశాలో 'లుంగీ' లొల్లి

భువనేశ్వర్, ఏప్రిల్ 24: ఒడిశా రాజకీయాల్లో లుంగీల లొల్లి నడుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఒడిశా అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్(బీజేడీ) అధినేత నవీన్ పట్నాయక్ ఓటర్లను ఉద్దేశించి ఒక వీడియోలో ప్రసంగించారు. ఇందులో ఆయన లుంగీ కట్టుకొని, పార్టీ గుర్తైన శంఖం ఉన్న ప్లకార్డులను పట్టుకున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఈ వీడియోలో ఓటర్లను అభ్యర్థించారు. నవీన్ పట్నాయక్ లుంగీ కట్టుకొని వీడియోలో మాట్లాడటాన్ని బీజేపీ నాయకుడు, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎద్దేవా చేశారు. దీంతో ధర్మేంద్ర ప్రధాన్‌కు కౌంటర్‌గా బీజేడీ నాయకులు సస్మిత్ పాత్ర, స్వయంప్రకాశ్ మహాపాత్ర లుంగీలు ధరించి ప్రెస్‌మీట్ నిర్వహించారు. నవీన్ పట్నాయక్ ఫొటో ముందు లుంగీలతో పోజులిచ్చారు. దీంతో ఇప్పుడు బీజేడీ – బీజేపీ మధ్య లుంగీ వార్ ముదురుతున్నది. కాగా, ఒడిశాలో లుంగీలు ధరించడం సాధారణమే అయినప్పటికీ అది ఇంటివరకే పరిమితమై ఉంటుంది.

అండర్‌వేర్లతో కాంగ్రెస్‌పై నిరసన

పుణే, ఏప్రిల్ 24: మహిళలకు ఉచితాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు అంటూ లోక్‌సభ ఎన్నికల వేళ వాళ్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ ప్రయత్నాలు చేయడాన్ని సేవ్ ఇండియన్ ఫ్యామిలీ ఫౌండేషన్ (ఎస్‌ఐఎఫ్‌ఎఫ్) తీవ్రంగా వ్యతిరేకించింది. దీనిపై ఆ సంఘం సభ్యులు మంగళవారం పలు చోట్ల తమ అండర్‌వేర్‌లను తగులబెట్టి నిరసనలు వ్యక్తం చేశారు. సగం కాలిన డ్రాయర్లను కాంగ్రెస్ పార్టీకి పంపిస్తామని కూడా చెప్పారు. ఒక్క మహిళలకు మాత్రమే పథకాలు ప్రకటిస్తూ.. పురుషులపై వివక్ష పాటిస్తున్నారని ఎస్‌ఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు రాజేశ్ వఖారియా అన్నారు. ఇది విభజన, సామాజిక అశాంతికి దారితీస్తుందని పేర్కొన్నారు. మహిళలను 'ఓటు బ్యాంకు'గా, పురుషులను 'ట్యాక్స్ బ్యాంకు'గా చూడటం రాజకీయ పార్టీలు మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో చట్టాలు పురుషులకు వ్యతిరేకంగా, మహిళా పక్షపాతంగా ఉన్నాయని ఎస్‌ఐఎఫ్‌ఎఫ్ వాదిస్తున్నది. పురుషులపై వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది.